క్లుప్తంగా

సకాలంలో పూర్తి చేయాలి



పనుల పురోగతిని తెలుసుకుంటున్న ఆయిల్ ఫెడ్ జనరల్ మేనేజర్ సుధాకర్ రెడ్డి

దమ్మపేట: పామాయిల్ ఫ్యాక్టరీలో నిర్వహిస్తున్న వార్షిక మరమ్మతులను సకాలంలో, సక్రమంగా పూర్తి చేయాలని ఆయిల్ ఫెడ్ జనరల్ మేనేజర్ సుధాకర్ రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీని, జనరల్ మేనేజర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన, సిబ్బందితో కలసి ఫ్యాక్టరీ అంతా కలియతిరిగి పరిశీలించారు. ప్రస్తుతం ఫ్యాక్టరీలో జరుగుతున్న పనులు, వార్షిక మరమ్మతుల పురోగతిని గురించి తెలుసుకున్నారు. పనుల విషయంతో నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఫ్యాక్టరీ మేనేజర్ కళ్యాణ్, కార్తీక్, రాజేష్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



అనారోగ్య బాధితుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

దమ్మపేట: హైదారాబాద్‌లో చికిత్స పొందుతున్న అనారోగ్య బాధితులను, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ శుక్రవారం పరామర్శించారు. దమ్మపేట మండలానికి చెందిన గడ్డిపాటి హైమావతి, తాళ్ల వెంకటస్వామి, జారే నాగేశ్వరరావులు, అనారోగ్య కారణంగా హైదారాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జారే, వారిని పరామర్శించి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసి, మెరుగైన వైద్యం అందించాలని సంబంధిత వైద్యులకు సూచించారు. వైద్య నిమిత్తం అయ్యే ఖర్చులను, ఎల్‌ఓసీ ద్వారా అందజేస్తానని భరోసా ఇచ్చారు.

మోడల్ ఇందిరమ్మ ఇల్లు పరిశీలన



మోడల్ ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ అశోక్

చండ్రుగొండ: మండలకేంద్రం చండ్రుగొండలోని ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో నిర్మాణ దశలో ఉన్న మోడల్ ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని ఎంపీడీఓ బయ్యారపు అశోక్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇదే తరహాలో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేపట్టనున్నట్లు తెలిపారు.

కనీస వేతన జీఓ విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకుడు

బూర్గంపాడు: కాంట్రాక్ట్ కార్మికుల కనీస వేతనాల జీఓను విడుదల చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సింగు నర్సింహారావు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కేవీ రావులు డిమాండ్ చేశారు. లక్ష్మీపురంలోని ఫీమాకెమ్ కాంట్రాక్ట్ కార్మికులతో శనివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు.

2012 నాటి జీఓ నంబర్ 11 ప్రకారం వీడీఏ కలిపి కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు చెల్లిస్తున్నారన్నారు. నాటి నుంచి నేటి వరకు నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయని, అందుకు అనుగుణంగా కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. అన్‌స్కిల్డ్ కార్మికులకు నెలకు రూ.26వేల కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. మోదీ సర్కార్ తీసుకువచ్చిన నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని, ఇందుకోసం పోరాటాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు గద్దం వెంకటేశ్వర్లు, బర్ల వెంకటేశ్వర్లు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణలో ముందడుగు!

- ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత కరాటే శిక్షణ
- రాణీ లక్ష్మీబాయి 'ఆత్మరక్షా ప్రశిక్షణ్' పేరుతో అమలు
- సద్వినియోగం చేసుకుంటున్న విద్యార్థినులు





కరాటే సాధన చేస్తున్న విద్యార్థినులు

సండే స్పెషల్

కరాటేతో ప్రయోజనాలు..

- కరాటే శిక్షణ శరీరాన్ని చురుగ్గా ఉంచడంతో పాటు కండరాలు బలపడేలా చేస్తుంది. శరీర సమతుల్యత పెరిగి జీర్ణక్రియ మెరుగుపడుతుంది.
- విద్యార్థులు తమను తాము రక్షించుకోవడం నేర్చుకుంటారు.అత్యవసర పరిస్థితుల్లో ఎలా ప్రతిస్పందించాలో తెలుసుకుంటారు.
- ఆత్మవిశ్వాసం పెరిగి తమపై తమకు నమ్మకం కలిగి ఉంటారు. మనస్సు, శరీరాన్ని నియంత్రించడం నేర్చుకుంటారు.
- కరాటే శిక్షణలో క్రమశిక్షణ అత్యంత ముఖ్యం. ఇది విద్యార్థులలో క్రమశిక్షణను పెంపొందిస్తుంది.
- కరాటే నేర్చుకోవడానికి చాలా సహనం అవసరం.ఇది విద్యార్థులలో సహనాన్ని పెంపొందిస్తుంది.
- కరాటే తరగతుల్లో ఇతర విద్యార్థులతో కలిసి పనిచేయడం ద్వారా సామాజిక నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయి.
- కరాటే శిక్షణ ఒత్తిడిని తగ్గించడానికి సహాయపడుతుంది. మానసిక ప్రశాంతతను కలిగిస్తుంది.

కరకగూడెం: శిక్షణలో భాగంగా శిక్షకులు సెల్ఫ్‌డిఫెన్స్ టెక్నిక్స్, కటాస్ (క్రమబద్ధమైన శారీరక చలనాలు), పరిస్థితిని అంచనా వేసుకునే స్కిల్స్ నేర్పిస్తున్నారు. తద్వారా అత్యవసర పరిస్థితుల్లో ఎలా ప్రతిస్పందించాలో తెలుసుకోవడానికి అవకాశం ఉంది. అవసరమైన శారీరక నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునేందుకు వీలుంది. ప్రభుత్వం కరాటే శిక్షణను ప్రోత్సహించడానికి ప్రధాన కారణం బాలికల భద్రత పలు చోట్ల బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టడానికి విద్యార్థుల శారీరక మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు సామాజిక నైపుణ్యాలను పెంపొందించడమే.

ఆత్మరక్షా ప్రశిక్షణ్..

తెలంగాణ ప్రభుత్వం బాలికలలో ఆత్మవిశ్వాసం మరియు స్వయంరక్షణ సామర్థ్యాన్ని పెంపొందించడానికి ఈ పథకాన్ని ప్రారంభించింది. కరాటే కేవలం యుద్ధ కళ మాత్రమే కాదు, జీవిత నైపుణ్యాలను పెంపొందించే సాధనం. ఈ పథకం ద్వారా అబ్బాయిలు కూడా శిక్షణ పొంది ప్రయోజనాలను పొందుతున్నారు. ఇది భవిష్యత్ తరాల సురక్షితత్వానికి దోహదపడుతోంది. కాగా గతేడాది డిసెంబర్ నెలలో ఈ కార్యక్రమం మండలంలోని భట్టుపల్లి, కరకగూడెం, అనంతారం, కేజీబీవీ, చిరుమళ్ల ఆశ్రమ పాఠశాలల్లో ప్రారంభించారు. ప్రతి పాఠశాలలో వారానికి 2 రోజులు శిక్షణ అందించబడుతుంది. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు మాత్రమే శిక్షణ పొందుతున్నారు శిక్షకురాలికి నెలకు రూ.5,000 గౌరవ వేతనం మంజూరు చేశారు. దీంతో శిక్షకులకు సైతం ఉపాధి దొరికినట్టైంది.

> కరాటే ద్వారా బాలికలు ఆపత్కర పరిస్థితుల్లో తమను తాము రక్షించుకునే సామర్థ్యాన్ని పొందుతారు. ఇందులో భాగంగా రాణీలక్ష్మీబాయి ఆత్మరక్షా ప్రశిక్షణ్ పథకం కింద 3 నెలల పాటు జిల్లా పరిషత్, కేజీబీవీ, ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థులకు ప్రభుత్వం ఉచిత శిక్షణ అందిస్తోంది.

ఆత్మవిశ్వాసం పెరిగింది..



కరాటే శిక్షణతో ఆత్మవిశ్వాసం పెరిగింది. ఆపత్కర పరిస్థితుల్లో తమకు తాము రక్షించుకునే సామర్థ్యాలను నేర్చుకున్నాం. ఇప్పుడు చాలా ధైర్యంగా ఉంది. కష్టతరమైన పరిస్థితులను ఎదుర్కొనే మనోధైర్యం ఈ శిక్షణలో కలిగింది.

– లక్ష్మీప్రణతి, 10వ తరగతి విద్యార్థిని, కరకగూడెం జెడ్పీ పాఠశాల

అన్ని రంగాల్లో రాణించేలా..



మూడు నెలల నుంచి విద్యార్థులకు ఉచిత కరాటే శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నాం. పిల్లలో నేర్చుకోవాలనే తపన తాపత్రయం ఉండడం గమనించి వారికి అన్ని రంగాల్లో రాణించేలా సమాయత్తం చేస్తున్నాం. కరాటే వల్ల విద్యార్థులకు చాల ప్రయోజనాలు ఉన్నాయి.

– లావణ్య, కరాటే శిక్షకురాలు

విద్యార్థులకు ఉపయోగం..



ప్రస్తుత పరిస్థితులో విద్యార్థినులకు కరాటే శిక్షణ ఎంతో అవసరం. బాలికల స్వీయరక్షణకు ఎంతో ఉపయోగపడుతాయి. ముఖ్యంగా కరాటే శిక్షణతో భయం లేని స్వభావం,సమస్యలను ఎదుర్కొనే శక్తి, క్రమశిక్షణ, నిబద్ధత విద్యార్థులను లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించేలా చేస్తాయి.

– గద్దం మంజుల, ఎంఈఓ, కరకగూడెం

సేంద్రియ సాగును ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న జీవ ప్రాజెక్టు శిక్షకురాలు ఉష

అశ్వారావుపేటరూరల్: సేంద్రియ పద్ధతిలో పంటలను సాగు చేసేందుకు మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని వాసన్–జీవ ప్రాజెక్టు శిక్షకురాలు ఉష అన్నారు. శనివారం అశ్వారావుపేట రైతు వేదికలో నాబార్డు, వాసన్ సంస్థ ఆధ్వర్యంలో ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఢిల్లీ, ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నుంచి హాజరైన గ్రామ సమన్వయకర్తలకు సేంద్రియ సాగుపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో జీవసేంద్రియ వనరులు పుష్కలంగా ఉంటాయని, వాటిని సద్వినియోగం చేసుకుని పంటలను సాగు చేస్తే ఆరోగ్య సంరక్షణతోపాటు మంచి లాభాలు వస్తాయన్నారు. భవిష్యత్ అంతా జీవ సేంద్రియ సాగు పంటలదేనని, ఈ పద్ధతిలో సాగు చేసే పంటలకు డిమాండ్ పెరుగుతుందని వివరించారు. సేంద్రియ సాగును పెంచేందుకు గ్రామగ్రామాన రైతులకు అవగాహన కల్పించాలని, తద్వారా మంచి ఫలితాలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో వాసన్ సంస్థ ప్రతినిధి సతీష్, జీవ ప్రాజెక్టు ట్రైనర్ ప్రాచి పాటిల్, సలహాదారు డాక్టర్ దీపక్, స్థానిక ఏఓ శివరాం ప్రసాద్, ఏఈఓలు పాల్గొన్నారు.

ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో నూతనంగా నిర్మాణం పూర్తి చేసుకున్న రామాలయం, లక్ష్మీగణపతి ఆలయం, శివాలయం, ఆంజనేయస్వామి ఆలమం వంటి ఉపాలయాలతో నవగ్రహ మండపంతో రూపుదిద్దుకున్న రామాలయంలో ఈ నెల 4 నుంచి 9 వరకు విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు నిర్వహించనుండగా.. ఆ ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను శనివారం ఆలయ ఆవరణలో ఆలయ నిర్మాణ కమిటీ చైర్మన్ మర్రి మల్లారెడ్డి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ నెల 4 నుంచి పూజా కార్యక్రమాలు 9న ప్రతిష్ఠాపనకు, మహా అన్నదానానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని నిర్మాణ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు కోరారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మణుగూరురూరల్: మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో నెలకొన్న మంచినీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ బీఆర్‌ఎస్ పార్టీ యువజన విభాగం ఆధ్వర్యంలో శనివారం మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యువజన నాయకులు మాట్లాడుతూ.. గత కొన్ని నెలలుగా మున్సిపాలిటీ ప్రజలు మంచినీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రధానంగా సుందరయ్యనగర్, శివలింగాపురం, బాపనకుంట ఏరియాల్లో నీటి ఎద్దడి తీవ్రంగా ఉందన్నారు. ఎండాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని, వాటర్ ట్యాంకర్లతో నీటిని సరఫరా చేయాలని కోరారు. అలాగే కట్టువాగులో పేరుకుపోయిన సిల్ట్‌ను తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యువజన నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.రవిప్రసాద్, యువజన నాయకులు బి.రమేష్, గుర్రం సృజన్, ఏశావ్, టి.నాగరాజు, శివశంకర్, రంజిత్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ బృందం పరిశీలన..

మణుగూరుటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని గ్రామాల ప్రజలకు గతవారం రోజులుగా తాగు నీరు రాక అవస్థలు పడుతున్నారని, మున్సిపాలిటీ అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని సీపీఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్ అన్నారు. శనివారం పట్టణంలోని పలు గ్రామాలను సందర్శించిన సీపీఐ బృందం.. వార్డుల్లోని ప్రజల పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామాలు, వార్డుల్లో తాగునీరు లేక ప్రజలు ఇబ్బంది పడుతుండగా.. కనీసం ట్యాంకుల ద్వారా అందించడంలోనూ అధికార యంత్రాంగం విఫలమైందన్నారు. ఇప్పటికైనా చర్యలు చేపట్టి తాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గద్దం వెంకటేశ్వర్లు, రాయల భిక్షం, ఆదరణ తోట రమేష్, కన్నెబోయిన ప్రసాద్, పోశెట్టి సంపత్ తదితరులు ఉన్నారు.

భగీరథ నీరు అందించాలి



పార్టీ సమావేశంలో మాట్లాడుతున్న కణితి రాముడు

దుమ్ముగూడెం: తెలంగాణా ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ ద్వారా మండలంలోని ప్రతీ గ్రామానికి మంచినీటిని సరఫరా చేయాలని బీఆర్‌ఎస్ కన్వీనర్, కోకన్వీనర్ కణితి రాముడు,జానిపాషాలు డిమాండ్ చేశారు. శనివారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. వచ్చే వేసవికాలం దృష్టిలో పెట్టుకొని గ్రామాలలో మంచినీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తెలంగాణా తొలిముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణా ప్రజలు ఎండాకాలంలో తాగునీరు లేక, వర్షాకాలంలో కలుషిత నీరు వల్ల పడుతున్న మంచినీటి కష్టాలు చూసి ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన మంచినీరు ఉచితంగా అందించాలనే లక్ష్యంతో మిషన్ భగీరథను ఏర్పాటు చేశారన్నారు. భగీరథ పథకం ఇప్పుడు సత్ఫలితాలను ఇస్తోందని అన్నారు.

గతంలో ఎండాకాలం వచ్చింది అంటే బోర్లు రాక ఉన్న బావులు ఎండిపోయి ప్రజలు మంచినీటి కోసం అష్టకష్టాలు పడే వారని, ఇప్పుడు ఆ పరిస్థితులు లేవన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రేసు లక్ష్మి, నాయకులు వాగే వెంకటేశ్వరావు, దామెర్ల శ్రీనివాసరావు, కుమ్మరికుంట సూర్య, తంతరపల్లి వెంకటేశ్వరావు, బిలపాటి లక్ష్మణ్ రావు, బాణోత్ నగేష్, తురుబాక మాజీ సర్పంచ్ భూక్య చందు, తదితరులు పాల్గొన్నారు.

మాదిగ అమరులకు నివాళి

చండ్రుగొండ: ఎమ్మార్పీఎస్ మండలశాఖ ఆధ్వర్యంలో అమరవీరుల దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఎస్సీ రిజర్వేషన్ల పోరాటంలో అసువులుబాసిన వందలాది మంది మాదిగలకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు చాపలమడుగు వెంకటేశ్వర్లు, రామరాజు, కాకాటి నరేష్, కె.లక్ష్మీనారాయణ, వెంకటి, గురువయ్య తిరుపతి, నవీన్, సురేష్ పాల్గొన్నారు.

మణుగూరురూరల్: ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక కార్యాలయంలో మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో అసువులు బాసిన మాదిగ అమరవీరుల చిత్రపటాలకు నాయకులు పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో మాదిగ అమరవీరుల త్యాగాలు మరువలేనివన్నారు. మాదిగ అమరవీరుల స్ఫూర్తితో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు, కార్యకర్తలు ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు కొమ్ము హుస్సేన్, బోయిళ్ల వెంకటేశ్వర్లు, నరసింహారావు, రజిత, కల్యాణ్, కృష్ణ, వెంకటేశ్‌లు తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఎంఎస్, ఎంఎస్ఎఫ్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మాదిగ అమరవీరుల దినోత్సవంను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాదిగ అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ.. మాదిగ జాతి చిరకాల ఆకాంక్ష ఎస్సీల వర్గీకరణ లక్ష్యసాధన కోసం తమ విలువైన ప్రాణాలు అర్పించిన మాదిగ అమరవీరుల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అలవాల రాజా పెరియార్, మేకల లత, కొప్పుల నాగమణి, పోల్లూరి సంధ్య, లక్ష్మి, లలిత, కొప్పుల తిరుపతి, కొమ్ము గిరి వెంకటేశ్వర్లు, ప్రభాకర్, రాయల రాము, ముత్యం, లక్ష్మణ్, వెంకన్న, సాయి, జ్వాలజ, దీప్తి, స్వప్న, రమ్య పాల్గొన్నారు.



చండ్రుగొండ: అమరవీరులకు నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



భద్రాచలంటౌన్: అమరుల చిత్రపటాల వద్ద దండోరా మోగిస్తున్న నాయకులు



మణుగూరురూరల్: అమరవీరులకు నివాళులర్పిస్తున్న నాయకులు

యువతి అదృశ్యం.. కేసు నమోదు

అశ్వారావుపేటరూరల్: ఓ యువతి అదృశ్యం కాగా, స్థానిక పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. స్థానిక ఎస్సై టి.యయాతి రాజు కథనం ప్రకారం.. మండల పరిధిలోని వినాయకపురం గ్రామానికి చెందిన ప్రమీళ రాణి అనే 20 ఏళ్ల యువతి ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో అన్నయ్య తరుణ్ చేసిన లిఖిత పూర్వక ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గైనకాలజిస్ట్ బాధ్యతలు స్వీకరణ

మణుగూరుటౌన్: 100 పడకల ఆస్పత్రిలో గైనకాలజిస్ట్‌గా అజంతా శనివారం బాధ్యతలు తీసుకున్నారు. మహబూబాబాద్‌కి చెందిన వైద్యురాలు గైనిక్ సేవలు అందిస్తారని.. నియోజకవర్గ ప్రజలు గైనకాలజిస్ట్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ సునీల్ తెలిపారు.

'బడ్జెట్‌లో కార్పొరేట్లకే పెద్దపీట'



సమావేశంలో మాట్లాడుతున్న బత్తుల వెంకటేశ్వర్లు

బూర్గంపాడు: కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కార్పొరేట్ సంస్థలకు పెద్దపీట వేసి, పేదలను పూర్తిగా విస్మరించిందని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల వెంకటేశ్వర్లు ఆరోపించారు. సారపాకలోని సీపీఎం కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతు యూపీఏ హయాంలో పోరాడి సాధించుకున్న ఉపాధి హామీ పథకాన్ని మోదీ సర్కార్ నిర్వీర్యం చేస్తోందన్నారు. ఉపాధి హామీ పథకానికి రూ 2.50లక్షల కోట్లు కేటాయించాల్సివుండగా కేవలం రూ.86వేల కోట్లతోనే సరిపెట్టారన్నారు. ఉపాధిహామీ పథకంలో గతేడాది కూలీలకు రూ.25వేల కోట్లు పెండింగ్ వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. జీఎస్టీ పేరుతో అన్ని వస్తువులపై పన్ను విధిస్తున్న కేంద్రం పేదల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు. ఈ సమావేశంలో నాయకులు కందుకూరి నాగేశ్వరరావు, బోళ్ల ధర్మ, ఇలాసాగరపు నాగేందర్, కన్నయ్య, సత్యం, ఎస్‌కె.మీరా, సీతమ్మ, ధర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు అమలు చేయాలి

మణుగూరురూరల్: సింగరేణి సంస్థలో పని చేస్తున్న నర్సరీ కాంట్రాక్ట్ కార్మికులకు సీఅండ్ఎండీ బలరాం ఆదేశాల మేరకు కనీస వేతనాలు అమలు చేయాలని కోరుతూ సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఇఫ్టూ) ఆధ్వర్యంలో శనివారం మణుగూరు ఏరియా ఎస్ఓటు జీఎం డి.శ్యాంసుందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ ఏరియా అధ్యక్షుడు మంగీలాల్ మాట్లాడుతూ.. నర్సరీ కాంట్రాక్ట్ కార్మికులకు ప్రావిడెంట్ ఫండ్, సింగరేణిలో ఉచిత వైద్యం వంటి సౌకర్యాలను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో నర్సరీ కాంట్రాక్ట్ కార్మికులు ఆర్.లక్ష్మీరేణుక, ఏ.ఇందిర, బి.లక్ష్మి, ఎం.సాయిదుర్గ దేవి, రాజేశ్వరి, షాహీన్, కుమారి పాల్గొన్నారు.

కర్రలే కరెంట్ స్తంభం!



విద్యుత్ వైర్లకు పెట్టిన కర్రలు

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని పండువారిగూడెం గ్రామంలో ఉన్న ఓ కోళ్ల ఫారం వద్ద విద్యుత్ వైర్లు కిందకు వేలాడుతున్నాయి. దీంతో స్థానికులు వేలాడుతున్న వైర్లకు కర్రలు పైకి లేపి కట్టారు. దాదాపు ఏడాది కాలంగా ఈ సమస్య నెలకొని ఉండగా, విద్యుత్ శాఖ అధికారులకు పట్టడం లేదని స్థానికులు వాపోతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి కర్రలు తొలగించి, స్తంభాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.